క్లుప్తంగా

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ


ఆర్డీఓను కలిసిన పత్తికొండ తహసీల్దార్, సిబ్బంది

పత్తికొండ(తుగ్గలి): పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీఓ)గా భరత్‌నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఆర్డీఓ రామలక్ష్మి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో శ్రీకాకుళం జిల్లా పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓను డివిజనల్ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తెర్నెకల్‌లో డెంగీ కేసు నమోదు


ఓ ఇంట్లో దోమల మందు స్ప్రే చేయిస్తున్న వైద్యాధికారులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో మంగళవారం డెంగీ కేసు నమోదయ్యింది. స్పందించిన మెడికల్ ఆఫీసర్లు అరుణజ్యోతి, వెంకటేశ్వర్లు గ్రామానికి చేరుకుని దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. రెండు సచివాలయాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపును వారం రోజులపాటు నిర్వహించాల్సి ఉంటుందని వైద్య సిబ్బందికి సూచించారు. గతంలో నిర్ధారణ అయిన డెంగీ కేసులు కూడా పరిశీలించారు. సర్పంచ్ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాముడు, శానిటేషన్ పనులు చేయించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయి బాబా, సూపర్‌వైజర్ రంగస్వామి, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండలో ఉచిత వైద్యశిబిరం


రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

దేవనకొండ: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 200 మందికి ఉచిత పరీక్షలు చేయించుకున్నారు. గుండెకు, కళ్లకు సంబంధించిన పరీక్షలు చేశారు. కార్యక్రమంలో విజయభాస్కరగౌడ్, ఆకుల వీరేష్, బడిగింజల రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు ఏజీపీ సిద్ధప్పకు సన్మానం


ఏజీపీ సిద్ధప్పను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆలూరు: ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా రెండోసారి నియమితులైన సీనియర్ న్యాయవాది సిద్ధప్పను ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం బార్ కార్యాలయ ఆవరణలో సన్మానించారు. సీనియర్ న్యాయవాదులు వాయుజీవోత్తం రావు, షేక్షావలి, రవి, ప్రవీణ్‌కుమార్, లక్ష్మీకాంతం, వీరేష్, నాయుడు తదితరులు పూల మాలల వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేష్‌నాయుడు, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తుకు నేడు ఆఖరు

పత్తికొండ(తుగ్గలి): ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం ఆఖరు రోజని ఎక్సైజ్ ఎస్‌ఐ సాయిప్రవీణ్ తెలిపారు. పత్తికొండ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పరిధిలో 14 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.2లక్షల నాన్ రిఫండబుల్ డీడీ తప్పని అన్నారు. ఇప్పటి వరకు మొత్తం 129 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

గర్భిణులకు పోషకాహారం అందించాలి

ఆలూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు ప్రభుత్వం మంజూరు చేసిన గుడ్లు, పాలు, పిండి తదితర పోషకాహారాన్ని అందించాలని ఆలూరు ఐసీడీఎస్ సీడీపీఓ మద్దమ్మ అంగన్ వాడీ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో వివిధ మండలాలకు చెందిన, సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు రక్తహీనత తలెత్తకుండా, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాలు రాకుండా చూడాలన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం.. భవితకు ఉపకారం

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు
- ఎన్ఎంఎంఎస్ కింద కేంద్ర ప్రభుత్వం అందజేత
- ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల పాటు సహకారం
- డిసెంబర్ 17 వరకు దరఖాస్తులకు అవకాశం



కృష్ణగిరి: కొందరు విద్యార్థులకు చదువుకోవాలనే తపన, పట్టుదల, ఉన్నత శిఖరాలకు చేరాలనే ఆకాంక్ష ఉన్నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చదువును మధ్యలోనే మానేసి కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటి వారి కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిటస్కాలర్‌షిప్‌ను తీసుకొచ్చింది. ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించి ప్రగతికి బాటలు వేస్తోంది. విజ్ఞానమే కొలమానంగా ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. ఈ జాతీయ ఉపకార వేతనం ద్వారా ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు అందజేస్తోంది.

ఆర్థిక భరోసా

తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని తల్లిదండ్రులు కలలు కంటారు. పేదరికం కారణంగా వారి ఆశలు ఆడియాశలు అవుతున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి చదివించే స్తోమత లేక చదువులు అర్ధాంతరంగా మధ్యలోనే ఆగిపోతున్నాయి. ఈ పరిస్థితి ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఇది గమనించిన కేంద్ర ప్రభుత్వం 2008లో పేద విద్యార్థుల కోసం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఏటా 8వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ కనబర్చిన వారికి నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తోంది.

ఇవీ అర్హతలు

ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హత ఉంటుంది. వీరు ఆరు, ఏడు తరగతుల్లో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలకు మించి ఉండకూడదు. పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదువుతూ ఉండాలి.

పరీక్షా విధానం

ఎన్ఎంఎంఎస్ పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మూడు గంటల వ్యవధిలో 180 ప్రశ్నలకు సమాధానం రాయాలి. పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు.

ఏడాదికి రూ.12 వేలు

ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున ఉపకారవేతనం ఏటా విద్యార్థి, తల్లిదండ్రుల జాయింట్ బ్యాంక్ ఖాతాకు నగదును జమ చేస్తారు. 9, 10 తరగతులతోపాటు ఇంటర్ కూడా ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివితేనే ఉపకార వేతనం అందుతుంది. ఈ పథకం పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

దరఖాస్తుల ఆహ్వానం

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్ఎంఎంఎస్‌కు ఆగస్టు 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. డిసెంబర్ 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఓసీ, బీసీలు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్‌కార్డులో ఉన్న వివరాల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఎన్ఎంఎం పథకం ఎంతో ఉపయోగకరం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తారు. పాఠశాలల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకుని విద్యార్థులతో దరఖాస్తు చేయించి ఈ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–సునంద, ఎంఈఓ, కృష్ణగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి: విద్యుత్ మరమ్మతులు, అభివృద్ధి పనుల కారణంగా బుధవారం త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తుగ్గలి, జొన్నగిరి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

సారా విక్రేత అరెస్టు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని బోయినిపల్లె గ్రామంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న బోయ సల్లమ్మను మంగళవారం అదుపులోని తీసుకున్నట్లు ఎస్ఐ జి.అశోక్ తెలిపారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా ఆడుతున్నా, అక్రమంగా మద్యం, నాటుసారా తయారు చేసినా, అమ్మినా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద శివారులోని ఎల్లార్తి, ఆదోని రోడ్డులో మంగళవారం ఎస్ఐ బాల నరసింహులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించి ఆర్‌సీ, ఇతర రికార్డులను పరిశీలించారు. ఓవర్‌లోడ్‌తో పాటు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న, సరైన రికార్డులు లేని వాటికి జరిమానాలు విధించారు.


శక్తిరూపిణి.. ముక్తిప్రదాయినీ


పత్తికొండ: గజలక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరి


సాయిబాబా గుడిలో గజలక్ష్మీదేవిగా..


మద్దికెర : మహాలక్ష్మీగా రాజ్యలక్ష్మి


మద్దికెర: అలంకరణలో చౌడేశ్వరిదేవి


కటారుకొండలో కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవి


వెల్దుర్తి అమ్మవారిశాలలో..


రామతీర్థంలో హోమ గుండానికి పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పిస్తున్న భక్తులు


వెల్దుర్తి: మహాలక్ష్మిగా భువనగాయత్రీదేవి


అస్పరి: మహాలక్ష్మీదేవిగా గాయత్రీ మాత


ఆలూరులో శ్రీ మాధవేశ్వరీ దేవిగా

తుగ్గలి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులక దర్శనమిచ్చారు. పత్తికొండ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీ మాత గజలక్ష్మీదేవిగా, సాయిబాబా గుడిలో సరస్వతీదేవి గజలక్ష్మీదేవిగా, తుగ్గలి దుర్గామాత లక్ష్మీదేవిగా భక్తులకు అభయమిచ్చారు.

మహాలక్ష్మిగా రాజ్యలక్ష్మి

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లోని శ్రీరంగనాథస్వామి, చౌడేశ్వరి దేవాలయాల్లో శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీరంగనాథస్వామి దేవాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారిని నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనం కల్పించారు. కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి మహామంగళ హారతి ఇచ్చారు. స్థానిక చౌడేశ్వరీదేవి అమ్మవారు ప్రత్యేక అలంకరణ, దేవమ్మ మహాచండీదేవిగా దర్శనమిచ్చారు.

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ గ్రామంలో లక్ష రుపాయలతో అమ్మవారికి అలంకరించారు. దుర్గమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వెల్దుర్తిలోని అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి మహాలక్ష్మిగా, వెల్దుర్తిలోని జాతీయ రహదారి పక్కన భువన గాయత్రీదేవి మహాలక్ష్మిగా భక్తులను కనువిందు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బాలకృష్ణస్వామి, రఘునాథ్‌రెడ్డి, జగదీష్, రమణాచారి, నాగెళ్ల శ్రీనివాసులు, వేముల లక్ష్మణస్వామి, తిరివిధి రామకృష్ణయ్య, రాంబాబు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మహాలక్ష్మి కటాక్షించు..

ఆస్పరి: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వేలసిన పంచముఖి గాయత్రీ మాత మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మండల కేంద్రమైన ఆస్పరిలో వెలసిన కన్యకాపరమేశ్వరీ మాత, మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన పార్వతీదేవి రాజ రాజేశ్వరీ అలంకారంలో దర్శనమిచ్చారు.

ఆలూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవిని మంగళవారం ఆలయ అర్చకులు మహేంద్ర ఆచార్ ఆధ్వర్యంలో శ్రీ మాధవేశ్వరీగా అలంకరించారు.

అక్రమ మద్యం స్వాధీనం

మంత్రాలయం : కర్ణాటక ఆర్టీసీ బస్సులో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ వై. విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా.. కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చిన కర్ణాటక బస్సులో పెద్దకడబూరు మండలం హులికన్వి గ్రామానికి చెందిన మస్కి లక్ష్మన్న అనే వ్యక్తి రెండు స్కూల్ బ్యాగులలో తీసుకెళ్తున్న 480 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తనిఖీలో పీసీలు సోమశేఖర్, వీరాంజినేయులు ఉన్నారు.

మాతాశిశు మరణాలు నివారించండి


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు శ్రీలక్ష్మి

మద్దికెర: గర్భిణులు, బాలింతలు శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని.. ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాలలో జరిగేలా చూడడమే కాకుండా మాతాశిశు మరణాలు నివారించేందుకు కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఆశా కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవ డం వల్ల తల్లి, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటా రని తెలిపారు. ప్రతినెలా వైద్యశాలలో పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు, సూచనలు పా టించేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత తాగునీరుపై అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు డెంగీ, అతిసారా బారిన పడకుండా జాగ్రత్తల గురించి తెలియజేయాలన్నారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సూపర్‌వైజర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

హాలహర్వి: ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలను పెంచాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి మన్సూర్ వలికి వివిధ సమస్యలపై వినతి పత్రం అందించారు. కృష్ణ మాట్లాడుతూ ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలని, ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీన ప్రభుత్వం ఏపీ ఆశావర్కర్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధివర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలు, సర్క్యులర్స్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విఠల్, ఆశావర్కర్లు శివమ్మ, విజయ్, లక్ష్మి, సునీత, ద్రాక్షవేణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వేదావతి వంతెన శిథిలం


వేదావతి బ్రిడ్జిపై గుంతల్లో నిలిచిన వర్షపునీరు


వంతెనపై రోడ్డుకు అడ్డంగా పెరిగిన ముళ్లకంప

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాలను కలిపే వేదావతి నదిపై నిర్మించిన వంతెన, రోడ్డు పూర్తిగా దెబ్బతింది. మార్లమడికి వద్దనున్న వంతెనను అప్పట్లో 15 టన్నుల బరువును మోయగల సామర్థ్యంతో నిర్మించారు. అయితే రెండు రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు తిరుగుతుండటంతో బ్రిడ్జి వరకున్న రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నారు. వంతెనపై, రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇక వంతెనకు రెండు వైపులా రెయిలింగ్ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షా కాలంలో కావడంతో రోడ్డుపైనున్న గుంతల్లో వర్షపు నీరు నిలిచి గుంతలు కనిపించక వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ముఖ్యంగా రాత్రి పూట ప్రయాణం చేయడానికి ద్విచక్రవాహనదారులు వెనకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులు

ఆలూరు: నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్. ఆనందరాజ్‌కుమార్, ఆలూరు నియోజకవర్గ ఏరియా స్కిల్ డెవలప్ మెంట్ కో–ఆర్డినేటర్ వీరేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. పది, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నికల్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు క్రెడిట్, యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్, సన్‌కిసాన్ అగ్రిఅండ్‌కో, నవభారత్ ఫర్టిలైజర్స్ తదితర కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాకు మొత్తం 95 మంది హాజరు కాగా 35 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయితేజ, నాన్‌టెక్నికల్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నెరణికిలో ప్రత్యేక పారిశుధ్య పనులు


నెరణికిలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి గ్రామంలోని వీధుల్లో సర్పంచ్ వన్నమ్మ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా ప్రత్యేక పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాల నిర్వహణలో నెరణికి గ్రామానికి ప్రధాన భూమిక ఉండడంతో ప్రతి ఇల్లు బంధువుల రాకతో కళకళలాడుతుంది. దీంతో గ్రామంలోని ప్రతివీధి శుభ్రంగా ఉండేలా సర్పంచ్ చర్యలు చేపట్టారు. అదేవిధంగా వర్షాకాలం కావడం, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో డ్రైనేజీలలో చెత్తాచెదారాన్ని, మురుగునీరును తొలగించారు. వీధులలో చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి


లక్కసాగరంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

కృష్ణగిరి: పంటల సాగులో నాణ్యమైన విత్తనాలను ఎన్నుకుని అవసరం మేరకే ఎరువులు వాడాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సూజాతమ్మ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని లక్కసాగరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, వేరుశనగ, పత్తి, మిరప పంటలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ గిరిష్, ఏఓ వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె పరిశీలించారు. సాగు సమయంలో విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వాడొద్దని చెప్పారు. పత్తి పంటకు ఆశించే గులాబి రంగు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని, ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షణ బుట్టలు అమర్చాలని తెలిపారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంట సాగు చేయాలన్నారు. కంది పంటలో మారుకా మచ్చల పురుగు నివారణకు నోవాల్యూరాన్ 200 ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 70 ఎంఎల్ లేదా ఇండోక్సాకార్బ్ 200 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే మిరపలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేష్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నెరణికిలో పోలీసుల కార్డెన్ సెర్చ్


నెరణికి కొండలో నాటుసారాను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

హొళగుంద: ఈ నెల 12న దేవరగట్టులో దసరా బన్ని ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు, ఆలూరు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది నెరణికి గ్రామంలో సోదాలు నిర్వహించారు. రింగు కర్రలు, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నెరణికి కొండలో నాటుసారా స్థావరాలను గుర్తించగా.. సారాను నిల్వ ఉంచిన బోయ రవి, హొసళ్లి శ్రీరాములు పరారైనట్లు ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు. అక్కడ 150 లీటర్ల నాటుసారను స్వాధీనం చేసుకుని ఇద్దరి పై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం బన్ని ఉత్సవంలో రింగుకర్రలు వాడడం, సారా సేవించి ఉత్సవంలో పాల్గొనడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలకు అవగాహన కలిగించారు.

బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి


విరుపాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసనాయక్

హాలహర్వి: రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ సూచించారు. మంగళవారం రాత్రి మండలంలోని విరుపాపురం, బిలేహాల్ గ్రామాల్లోని ప్రజలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12న బన్ని జైత్రయాత్రలో రింగులు తొడిగిన కర్రలను ఎవరూ వాడరాదన్నారు. స్వామివారి విగ్రహాల ఊరేగింపులో నిప్పు కాగడాలను భక్తులపై విసరడం, అల్లర్లకు దిగడం లాంటివి చేస్తే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. బన్ని ఉత్సవాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశామని, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ చంద్ర, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి

గోనెగండ్ల : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత వరకు పంట నమోదు, ఈ–కేవైసీ పూర్తయ్యిందని వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని, పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకుంటేనే ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగితే పరిహారం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఏఓ హేమలత, తహసీల్దార్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.